నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, బుధవారం 16 ఏప్రిల్ 2025 | KARIMNAGAR

సభకు రావాలి.. ఆశీర్వదించాలి

- రజతోత్సవ సభను సక్సెస్ చేయాలి
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- బీడీ కార్మికులు, పలు కులసంఘాలకు ఆహ్వాన పత్రిక అందజేత

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 15: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కదిలిరావాలని, సభను సక్సెస్ చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల పిలుపునిచ్చారు. మంగళవారం కోరుట్ల పట్టణంలోని దేశాయి బీడీ కార్కానాలో బీడీ కార్మికులు, టేకేదారులు, ప్యాకింగ్ కార్మికులతో పలు కుల సంఘాలకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలోనే తెలంగాణ సుభిక్షంగా ఉందని, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, దేశంలో బీడీ కార్మికులకు పింఛన్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. రైతులకు రైతు బీమా, రైతుబంధు సకాలంలో అందివ్వడమే కాకుండా పంటలు పండించుకునేందుకు ప్రతి ఎకరానికి నీరు, నిరంతర విద్యుత్‌ను ఇచ్చిన కేసీఆర్‌ను రైతులు మరవలేకపోతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ కేసీఆర్‌ను ఆశీర్వదించడానికి మహాసభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆయన వెంట రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, నాయకులు పిడుగు సందయ్య, ఏనుగందుల సత్యనారాయణ, బాబురావు, ఎండీ అమీర్, బొమ్మ రాజేశం, నాయకులు, తదితరులు ఉన్నారు.

బీడీ కార్మికురాలికి రజతోత్సవ సభకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

అక్రమ కేసులకు బెదిరేదిలేదు

- తెలంగాణ కోసం జైలుకు గుండెలు మావి.. ఎలా వెనకడుగు వేస్తాం?
- రజతోత్సవ సభ తర్వాత కాంగ్రెస్ పతనం
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

యైటింక్లయిన్ కాలనీ, ఏప్రిల్ 15 : త్యాగాల పునాదులపై పుట్టిందే గులాబీ పార్టీ అని, అక్రమ కేసులకు అదిరేది లేదని, బెదిరేది లేదని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ స్పష్టం చేశారు. నాడు తెలంగాణ కోసం ఉద్యమించి లాఠీ దెబ్బలు తిని జైలుకు కూడా వెళ్లిన గుండెలు తమవని, ఇప్పుడు ఉద్యమాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఎలా వెనుకడుగు వేస్తామని ప్రశ్నించారు. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులపై బెదిరింపులకు పాల్పడుతున్న ప్రతి ఒక్కరి పేర్లు రాసి పెట్టుకుంటున్నామని, ఎప్పటికైనా తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. రజతోత్సవ సభలో కేసీఆర్ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తారని, ఇక కాంగ్రెస్ ప్రభుత్వం రోజులు లెక్కబెట్టుకోక తప్పదని స్పష్టం చేశారు. ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఆరంభమవుతుందని విమర్శించారు. మంగళవారం గోదావరిఖని టీబీజీకేఎస్ కార్యాలయంలో సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల శ్వాసగా త్యాగాల పునాధులపై పుట్టిన గులాబీ పార్టీ జెండాను ఇప్పుడు అదే నాలుగు కోట్ల మంది ఎత్తుకునేందుకు సిద్ధమవుతున్నారని, రాష్ట్రానికి మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అబద్ధపు హామీలు, ఆరు గ్యారెంటీలను నమ్మినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ప్రజలు ఇప్పటికే గుర్తించారని చెప్పారు. రైతులకు రుణమాఫీ చేయకపోగా, రైతు భరోసా కూడా ఇవ్వకుండా నట్టేట ముంచిందన్నారు. లక్ష ఎకరాలకు నీరందించే లక్ష్యంతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును కుట్ర పూరితంగా బంద్ చేయించి తెలంగాణను మళ్లీ ఎడారిగా మారుస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో పట్టణాధ్యక్షుడు మేడి సదానందం, టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు చెరుకు ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బాదె అంజలీ దేవి, ముద్దసాని సంధ్యారెడ్డి, నాయకులు గుడెల్లి రాంచందర్, దాసరి బాలరాజు, కుమార్ నాయక్, తీగల సుజాత, ఓరుగంటి శంకర్, మారుతి పాల్గొన్నారు.

రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- 'చలో వరంగల్' బహిరంగ సభ పోస్టర్ అవిష్కరణ

మానకొండూర్, ఏప్రిల్ 15 : బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు తరలి వచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపు నిచ్చారు. మంగళవారం మానకొండూర్ మండల కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంతోపాటు శంకరపట్నం మండలం వంకాయగూడెం మాధవసాయి గార్డెన్‌లో వేర్వేరుగా 'చలో వరంగల్ రజతోత్సవ బహిరంగ సభ' పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. స్వరాష్ట్రాన్ని సాధించిన పార్టీగా, ప్రాంతీయ పార్టీగా బీఆర్ఎస్‌కు ప్రజల్లో విశేష ఆదరణ ఉందన్నారు. రజతోత్సవ సభ అంటే బీఆర్ఎస్ పార్టీ కుంభమేళాగా ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి 10 వేలకు పైగా మంది తరలి వస్తారని తెలిపారు. ఎండాకాలం దృష్ట్యా ఎక్కువ మందిని బస్సుల్లో తరలించడానికే అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. గ్రామాల్లో పార్టీ జెండా ఎగురవేసి బహిరంగ సభకు రావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మానకొండూర్ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, శంకరపట్నం మండలాధ్యక్షుడు గంట మహిపాల్, మాజీ జడ్పీటీసీలు పొద్దుటూరి సంజీవరెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్వీ నియోజకవర్గ కన్వీనర్ గుర్రం కిరణ్‌గౌడ్, నాయకులు రామంచ గోపాల్‌రెడ్డి, రెడ్డి సంపత్‌రెడ్డి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, గోపు ఈశ్వర్‌రెడ్డి, నామాల శ్రీనివాస్, నెల్లి మురళి, బోడ రాజశేఖర్, ఇస్కుల్ల అంజయ్య, నెల్లి శంకర్, పిండి సందీప్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

కాంగ్రెస్‌కు దిమ్మతిరగాలె

- హామీలు నెరవేర్చే వరకు పోరాడుతా
- ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొనేందుకు సిద్ధం
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, ఏప్రిల్ 15 : బీఆర్ఎస్ రజతోత్సవ సభతో కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరగాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం సాయం త్రం హుజూరాబాద్ ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలివస్తారని, అన్ని నియోజకవర్గాల కంటే హుజూరాబాద్ నుంచి అత్యధికంగా ప్రజలు హాజరు కావాలని కోరా రు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, కానీ, 16 నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోయిందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు వదిలిపెట్టేదే లేదని స్పష్టం చేశారు. హామీలపై నిలదీస్తే తనపై కేసులు నమోదు చేస్తున్నారని, ఎన్ని కేసులు పెట్టినా పోరాటానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతులకు రైతు భరోసా ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ బండ్ పెట్టిందని, కేసీఆర్ కంటికి రెప్పలా కాపాడుకున్న రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా, రుణమాఫీ, రైతు బీమా, 24 గంటల కరెంట్ విషయంలో పూర్తిగా అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ గందె రాధికా శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్, అపరాధ ముత్యంరాజు, ములుగు సృజనాపూర్ణ చందర్, కిషన్, కల్లపల్లి రమాదేవి, కేసీరెడ్డి లావణ్య, ఆర్కే రమేశ్, కోయడ కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల్లోనే ధాన్యం.. కొనేది ఎప్పుడో!

- కుప్పలు తెప్పలుగా వడ్ల రాశులు
- ఇంకా మొదలు కాని కొనుగోళ్లు
- ఆందోళనలో రైతులు
- వాతావరణంలో మార్పులతో ఆందోళన
- కాపాడుకునేందుకు తిప్పలు

చొప్పదండి: పొలంలో వరి కోస్తున్న హార్వెస్టర్

కరీంనగర్ రూరల్: దుర్శేడ్‌లో సింగిల్ విండో కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

ధాన్యం పేరుకుపోతున్నది. కేంద్రాల్లోనే మూలుగుతున్నది. కోతలు మొదలై వారం, పదిరోజులైనా కొనుగోళ్లు మొదలు కాకపోవడంతో కుప్పలు తెప్పలుగా పోగుపడుతుండగా, రైతాంగం ఆగమవుతున్నది. వాతావరణంలో మార్పులు, అకాల వర్షాలతో ఆందోళన చెందుతున్నది. వడ్లను కాపాడుకునేందుకు సెంటర్ల వద్దే పడిగాపులుకాస్తున్నది. ఇదే అదనుగా దళారులు రెచ్చిపోతుండగా, పలువురు రైతులు వేచిచూడలేక అగ్గువకే అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, తమ రెక్కల కష్టం నీళ్లపాలు చేయొద్దని, కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని రైతాంగం డిమాండ్ చేస్తున్నది.

చొప్పదండి/ చిగురుమామిడి/ కరీంనగర్‌రూరల్, ఏప్రిల్ 15: ఉమ్మడి జిల్లాలో యాసంగి వరి కోతలు మొదలయ్యాయి. వారం పది రోజుల నుంచి ఊపందుకున్నాయి. ఈ నెల చివరి వారంలో కోయాల్సిన రైతులు, అకాల వర్షాలు పడే అవకాశాలతో ముందుగానే ప్రారంభించారు. వచ్చిన దిగుబడులను ఐకేపీ, సింగిల్ విండోలు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసే ప్రదేశాలకు తరలిస్తున్నారు. అయితే ఇంకా కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే 10 నుంచి 15శాతం కోతలు పూర్తయ్యాయని, మరో 15 రోజుల్లో 40శాతం కంప్లీట్ అవుతాయని, ఇంకెప్పుడు మొదలుపెడతారని ప్రశ్నిస్తున్నారు. కొనుగోళ్లు ప్రారంభంకాకపోవడంతో ఇదే అదనుగా దళారులు రెచ్చిపోతున్నారు. కల్లాల వద్దే కాంటాలు పెడుతున్నారు. చాలా మంది రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని భావిస్తుండగా, మరికొందరు వేచి చూడలేక ప్రైవేట్ వ్యాపారులకు అమ్మేస్తున్నారు.

కేంద్రాల వద్దే పడిగాపులు

కొనుగోళ్లు మొదలుకాక రైతులు అరిగోసపడుతున్నారు. చిగురుమామిడి, చొప్పదండి, కరీంనగర్ రూరల్ మండలాల్లో కోతలు స్పీడప్ కావడంతో ఆందోళన చెందుతున్నారు. చిగురుమామిడి మండలంలో 20 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. సుమారు 49 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. గతంలో వ్యవసాయ సహకార పరపతి సంఘం(సింగిల్ విండో) ద్వారా ముల్కనూరు, రామంచ, గునుకుల పల్లె, సుందరగిరి, నవాబుపేట, బొమ్మనపల్లి, రేకొండ, సీతారాంపూర్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, మహిళా సంఘాల ద్వారా (సెర్ప్– ఐకేపీ) ఆధ్వర్యంలో చిగురుమామిడి, బొమ్మనపల్లి, ఇందుర్తి గ్రామాల్లో ఏర్పాటు చేశారు. కానీ, ఈ సీజన్‌లో మాత్రం ఏ ఒక్క కేంద్రంలో కొనుగోళ్లు ప్రారంభించలేదు. గన్నీ సంచులు, తూకం వేసే, తేమ కొలిచే, తూర్పార పట్టే యంత్రాలను సమకూర్చడం, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు తదితర పనులు చేపట్టలేదు. అయితే ఉల్లంపల్లి, నవాబ్ పేట్, సుందరగిరి, కొండాపూర్ తదితర గ్రామాల్లో 250 ఎకరాల వరకు కోతలు పూర్తికాగా, రైతులు కొనుగోళ్ల కోసం వేచిచూడలేక దళారులకు అమ్మేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది.

చొప్పదండి రైతుల అవస్థలు

చొప్పదండి మండలంలో ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. మండలంలో ఈ సీజన్‌లో 17,549 ఎకరాల్లో దొడ్డు రకం సాగు చేశారు. ప్రభుత్వం సన్నాలకు ₹500 బోనస్ చెల్లిస్తుండడంతో 600 ఎకరాల్లో సాగు చేశారు. మొత్తం 50వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా, చాకుంట, రుక్మాపూర్, కొలిమికుంట, వెదురు గట్ట, కాట్నపల్లి, కోనేరుపల్లి, రాగంపేట, రేవెల్లి, ఆర్నకొండ, పెద్ద కుర్మపల్లిలో కోతలను ముమ్మరం చేశారు. ఐకేపీ, సింగిల్ విండోలు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసే ప్రదేశాలకు తరలిస్తున్నారు. అయితే కొనుగోళ్లు మొదలు కాకపోవడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అపసోపాలు పడుతున్నారు. వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఒక్కటీ తెరుచుకోలె

కరీంనగర్ రూరల్ మండలంలో ఈ సీజన్‌లో 11వేల ఎకరాల్లో దొడ్డు రకం, 2వేల ఎకరాల్లో సన్నాలు సాగు చేశారు. మొత్తం 20 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కానీ మండలంలోని ఏ ఒక్క గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాలకు రైస్‌మిల్లులు కూడా అలాట్‌మెంట్ చేయలేదు. ఈ క్రమంలో వేచిచూడలేక రైతులు దళారులను ఆశ్రయిస్తూ నష్టపోతున్నారు.

ఎప్పుడు కొంటరు?

వారం క్రితమే మా ఊళ్లే కోతలు పూర్తయినయి. వడ్లల్ల తేమ లేకుండా ఆరబెట్టినం. ఇప్పటికీ సెంటర్లు పెట్టలే. చేసేదేం లేక సింగిల్ విండో, ఐకేపీ వాళ్లు కేంద్రాల పెట్టే దగ్గర వడ్లు పోసేందుకు సిద్ధమైతున్నం. మా ధాన్యం ఎప్పుడు కొంటరో అధికారులు చెప్పాలి. వెంటనే కేంద్రాలు ప్రారంభించాలి.

- నాగేల్లి రాజిరెడ్డి, రైతు, లంబాడిపల్లి (చిగురుమామిడి)

మిలుల్ల అలాట్‌మెంట్ రాలే

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేదుకు మేం సిద్ధంగానే ఉన్నాం. ఇప్పటికే తూకం, మిషనరీ అన్నీ సమకూర్చుకున్నాం. కానీ, మాకు మిల్లుల అలాట్‌మెంట్ ఇంకా ఇవ్వలే. అధికారులు చొరవ చూపాలి. మిల్లులు కేటాయిస్తే వెంటనే కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

- పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, కరీంనగర్ సింగిల్ విండో చైర్మన్

వెంటనే కొనాలి

వరి కోతలు నడుస్తున్నయి. కోసిందికోసినట్టే కేంద్రాలకు తెస్తున్నం. ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో సెంటర్ల వద్దే ఉంటున్నం. కొద్దిరోజులుగా అకాల వానలు పడుతున్నాయి. చాలా ఇబ్బందులు పడి కాపాడుకుంటున్నం. ధాన్యం లారీలో ఎక్కేదాకా ఇబ్బందే ఉన్నది. ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలి.

- పోలే మహేశ్ రైతు, రుక్మాపూర్ (చొప్పదండి)

చొప్పదండి: రుక్మాపూర్ కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం

నేడు జగిత్యాలకు ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల, ఏప్రిల్ 15 : నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం జగిత్యాలకు రానున్నారు. ఉదయం 11 గంటలకు జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే రజతోత్సవ సభ సన్నాహక సమావేశానికి హాజరుకానున్నారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు కవిత దిశానిర్దేశం చేయనున్నారని చెప్పారు. సమావేశానికి జగిత్యాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 15: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని అహల్యనగర్‌లో బోర్నపల్లి రోడ్డుపై మంగళవారం ఎలక్ట్రిక్ వాహనం దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం(ఏడీఎంఎస్)పై వెళ్తున్న సమయంలో వాహనం నుంచి మంటలు వస్తుండడం గమనించి వాహనాన్ని వదిలేసి వెళ్లిపోయారు. స్థానికుల సమాచారంతో ఫైర్ సేఫ్టీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. కాగా, వాహనం ఎవరిది అన్న విషయం తెలియాల్సి ఉంది.

దగ్ధమవుతున్న ఎలక్ట్రిక్ బైక్

భూములు మునుగుతయ్..
నష్ట పరిహారం ఇవ్వండి

- మల్కపేట రిజర్వాయర్ కుడికాలువ పనులను అడ్డుకున్న రైతులు
- పరిహారం చెల్లించాకే పనులు చేయాలని డిమాండ్

మల్కపేట కుడికాలువ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

కోనరావుపేట, ఏప్రిల్ 15 : చెరువులో మునిగిపోయే పట్టా భూములకు తగిన నష్టపరిహారం అందించడంతో పాటు జీవనాధారం చూపించి తమను ఆదుకోవాలని మల్కపేట రైతులు వేడుకున్నారు. మంగళవారం కోనరావుపేట మండలంలోని మల్కపేట రిజర్వాయర్ ప్యాకేజ్–9లో భాగంగా నిర్మిస్తున్న కుడికాలువ పనులను అడ్డుకున్నారు. తమకు పరిహారం అందించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు పోలీసుల బలగాలను దించి పనులను కొనసాగించారు. వివరాల్లోకి వెళితే.. మల్కపేట రిజర్వాయర్ కుడికాలువ పనులు పూర్తి చేసి చెరువులు, కుంటలు నింపే విధంగా అధికారులు మిగిలిన కాలువ పనులు చేపట్టారు. ఈ క్రమంలో కాలువ ద్వారా మల్కపేట ఊర చెరువు నింపితే సుమారు 50 మంది రైతులుకు ఉన్న 40 ఎకరాల భూములు నీటి మునిగిపోతాయని అందోళన చెందుతున్నారు. భూములు మునిగిపోతే పంట వేయడానికి అవకాశం లేదని ప్రత్యామ్నాయం చూపించందే పనులు నిర్వహించవద్దని కోరుతున్నారు. ఇప్పటికే అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీంతో మంగళవారం రైతులు పనులను అడ్డుకోగా ప్రాజెక్టు అధికారులు వారితో మాట్లాడారు. చెరువుల్లో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించేందుకు వీలు లేదని, రైతులు భూములు నష్టపోకుండా కాలువ దగ్గర గేట్ ఏర్పాటు చేస్తామని అధికారులు సూచించారు. అయినా, వినకపోవడంతో పోలీసు బలగాలను దించి, పనులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఈఈ కిశోర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా చెరువులలో భూములు కోల్పోయిన ఎక్కడ కూడా నష్టపరిహారం అందించలేదని చెప్పారు. సుమారు 200 మీటర్ల పనులు పూర్తయితే కుడి కాలువ ద్వారా చెరువులు, కుంటలు నిండి రైతులకు సాగునీరందనుందని పేర్కొన్నారు. రైతులు సహకరించి సజావుగా పనులు సాగిలే చూడాలని కోరారు.

వడ్లు కొనుర్రహో!

సీపీఎం నాయకుల డప్పు చాటింపు

తిమ్మాపూర్, ఏప్రిల్ 15 : రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పోసి వేచి చూస్తున్నా ప్రభుత్వం ఇంకా ఎందుకు కొనుగోళ్లు ప్రారంభించలేదని సీపీఎం నాయకులు ప్రశ్నించారు. తిమ్మాపూర్ కొనుగోలు కేంద్రంలోని వడ్ల రాశుల వద్ద సీపీఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో 'వడ్లు కొనుర్రహో..' అంటూ డప్పు చాటింపు చేస్తూ నిరసన తెలిపారు. పదిహేను రోజుల నుంచి వరి కోతలు మొదలైనా కేంద్రాలను ప్రారంభించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. జిల్లావ్యాప్తంగా కనీసం 20 కేంద్రాలు కూడా ప్రారంభించలేదన్నారు. కేంద్రాలను ప్రారంభించినా.. తూకం వేయడం లేదన్నారు. వాతావరణంలో మార్పులతో రైతులు తక్కువ ధరలకు దళారులకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కల్లం వద్ద డప్పు కొట్టి చాటింపు చేస్తున్న సీపీఎం నాయకులు

కార్యక్రమంలో నాయకులు సుంకరి సంపత్, మాతంగి శంకర్, వెంకటస్వామి, కుమార్, నాగరాజు, వేల్పుల కుమార్, ఆడిచర్ల వెంకటేష్, బోళ్ల మొగిలి, గడ్డి రాజయ్య, మాతంగి వెంకటేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.